క్లుప్తంగా

నిప్పులవాగుకు 1,026 క్యూసెక్కుల నీరు


కేసీ కాల్వలో ప్రవహిస్తున్న సాగునీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 1,026 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రైతుల వినియోగార్థం లాకిన్స్‌లా వరకు 1,302 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. ఈ నీటిని నిప్పులవాగుకు 1,026క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 256 క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 20క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ అభయాంజనేయస్వామి వారికి ఆదివారం అమావాస్య సందర్భంగా నవధాన్యాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి కుంకుమార్చన, 13 రకాల నక్షత్ర హారతులు ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ ఆవరణలో అల్పాహారం ఏర్పాటు చేశారు.

వస్త్రాల బహూకరణ


వస్త్రాలు అందజేస్తున్న రాజ్‌పురోహిత్ జబ్బర్‌సింగ్


నందికొట్కూరు: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానానికి స్థానిక వ్యాపారుడు రాజ్‌పురోహిత్ జబ్బర్‌సింగ్, వారి కుమారులు వస్త్రాలు బహుకరించారు. ఆదివారం శ్రీశైల దేవస్థాన పరిపాలన భవనంలోని ఈఓ చాంబర్‌లో సుమారు రూ.2లక్షల విలువైన 32 పట్టుచీరలు, 11సిల్క్ పంచెలు, 10 కాటన్ పంచెలు దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావుకు అందజేశారు. ఆయా వస్త్రాల విలువ ఉంటుందని దాతలు తెలిపారు.

రణభేరీని విజయవంతం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25వ తేదీన గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న రణభేరీ బహిరంగ సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్ పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం రణభేరీ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. ఉపాధ్యాయులు పలుమార్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు బోధనేతర కార్యక్రమాలతో విద్య కుంటుపడేలా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ పీఆర్‌సీ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను చెల్లించి మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జాకీర్‌హుసేన్, బొజ్జయ్య, బాలాజీ, నిజాముద్దీన్, రాముడు, కలీముల్లా పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక


ప్రతిజ్ఞ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): బండిఆత్మకూరు మండలం ఏపీటీఎఫ్ కార్యవర్గాన్ని ఆదివారం నంద్యాల పట్టణంలోని ఆ ఫెడరేషన్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి శివయ్య అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వెంకటరామిరెడ్డి వ్యవహరించారు. బండిఆత్మకూరు మండల ఏపీటీఎఫ్ కమిటీ 2027 వరకు ఉంటుందన్నారు. మండల అధ్యక్షుడిగా ఎంపీవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శివలింగమయ్య, ఉపాధ్యక్షులుగా నాగార్జునరెడ్డి, చిన్నబాలునాయక్, స్వర్ణలత, పవన్‌కుమార్, కౌసర్, కార్యదర్శులుగా రాజేష్, సునిత, మాదవ్, చక్రపాణి, రాంభూపాల్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌ను ఎన్నుకోగా జిల్లా కౌన్సిల్ సభ్యులుగా లక్ష్మయ్య, నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి, వెంకటరామిరెడ్డి, శోభారాణి, రామరాజు, సామన్నను ఎన్నుకున్నారు.

దుర్గతులను దూరం చేసే 'నవదుర్గలు'

- నవదుర్గల విశిష్టతను వివరించిన మార్కండేయ పురాణం
- నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు
- శ్రీశైల భ్రమరాంబకు నవదుర్గాలంకరణలు


శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: దుర్గాదేవి తనను స్మరించిన ప్రాణులందరి భయాన్నీ హరిస్తుంది. శుభకరమైన బుద్ధిని ఇస్తుంది. పేదరికాన్ని పోగొడుతుంది. దుర్గముడు అనే రాక్షసుడిని సంహరించినందు వల్ల అమ్మవారికి దుర్గ అనే పేరు కలిగింది. నవదుర్గ రూపాల్లో శరనవరాత్రులతో అర్చింపబడుతూ పూజలందుకోనుంది.

దుర్గముడి సంహారం..


'దుర్గమ' అంటే దాటడానికి కష్టమైనది అని అర్థం. సంక్లిష్టతలను, కష్టాలను నివారించేది కనుక 'దుర్గా' నామం ఏర్పడింది. దుర్గముడనే రాక్షసుడు వేదాలను ఎత్తుకెళ్లాడు. దాంతో యజ్ఞయాగాదులకు అటంకం ఏర్పడింది. ప్రకృతి గతి తప్పింది. అప్పుడు దుర్గాదేవి శాకంబరి వంటి వివిధ రూపాలలో అవతరించి, ఆ రాక్షసుణ్ణి సంహరించింది. ప్రతి మాసంలోనూ శుక్ల పక్షంలో వచ్చే ఎనిమిదో తిథిని దుర్గాష్టమిగానే శాక్తేయులు నిర్వహించుకుంటారు. శక్తి ఆరాధనకు ప్రధానమైన వసంత, అశ్వయుజ, మాఘ, ఆషాడ నవరాత్రి దినాల్లో దుర్గావతారాలను వివిధ పేర్లతో పూజిస్తారు. అశ్వయుజ మాసంలో వచ్చే శరన్నవరాత్రులలో నవ దుర్గాలంకారాలు ప్రధానమైనవి. నేటి నుంచి అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని నవదుర్గా స్వరూపాల గురించి ప్రత్యేక కథనం..

శైలపుత్రి..



పర్వతరాజు హిమంతుని కుమార్తె కనుక తొలిదుర్గను శైలపుత్రిగా అర్చిస్తారు. అమెను సేవించినవారు అన్ని రకాల వ్యాధుల నుంచి విముక్తి కలిగి, ఆరోగ్యం పొందుతారని విశ్వాసం.

బ్రహ్మచారిణీ..



నారద మహాముని బోధలతో ప్రభావితురాలైన పార్వతి అన్నాహారాలు మాని శివుని కోసం తపస్సు చేసింది. అమె అకుంఠిత దీక్ష, సాధనలకు పరమశివుడు పరమానందించి, అమెను తనలో సగం చేసుకుని అర్ధనారీశ్వరుడయ్యాడు. బ్రహ్మచారిణీ మాత తన భక్తులకు శక్తి, ధైర్యం, అంకితభావం, ఏకాగ్రత లక్షణాలను వరంగా ప్రసాదిస్తుంది.

చంద్రఘంట..



అర్ధచంద్రుడిని శిరస్సున ధరించి ఉంటుంది. దశ బాహువులతో స్వర్ణకాంతులీనుతుంది. అయుదు చేతుల్లో బాణం, ధనుస్సు, త్రిశూలం, ఖడ్గం, గద, ధరించి రౌద్రరసాన్ని కురిపిస్తుంది. మరో మూడు హస్తాల్లో కమలం, కమండలం, జపమాల ధరించి ప్రసన్నంగా ఉంటుంది. వరద, అభయ ముద్రలతో భక్తులను ఆశీర్వదిస్తుంది. సింహ వాహినిగా నిరంతరం చెడును ప్రతిఘటిస్తూ ఉంటుంది. భయంకరమైన స్వరంతో రాక్షసులను భయపెడుతుంది. అమె కరుణా కటాక్షాలతో భక్తుల బాధలు, దుఖాలు పోగొట్టుకుంటారు.

కూష్మాండదుర్గ..



కూష్మాండ దేవి వదనం స్వచ్ఛ కాంతులీనుతూ బంగారు వర్ణంతో అలరారుతుంది. ఈ తల్లికి ఎనిమిది చేతులు ఉండడంతో అష్టభుజిగా పూజలు అందుకుంటోంది. నాలుగు చేతుల్లో బాణం, ధనుస్సు, చక్రం, గద ఉంటాయి. మూడు చేతుల్లో తామరపువ్వు, జపమాల, కమండలం ఉంటాయి. ఎనిమిదో చేయి అమృత భాండాన్ని ధరించి ఉంటుంది. ఈ అమృతమే మానవులకు ఆరోగ్యాన్ని, ఆయుర్ధాయాన్ని ఇస్తుందని భక్తుల విశ్వాసం.

స్కందమాత..



పుత్రుడైన కుమారస్వామిని ఎల్లప్పుడూ తన ఒడిలో ఉంచుకుని దర్శనమిస్తుంది స్కందమాత. ఈమె చతుర్భుజి. స్కందుని ఒడిలో కూర్చోబెట్టుకొని, మరో చేత కలువ పువ్వు ధరించి ఉంటుంది. మిగిలిన రెండూ అభయ వరద ముద్రలు. స్కందమాతను ఉపాసించిన భక్తుల కోరికలన్నీ నెరవేరుతాయి. దివ్య తేజస్సు లభిస్తుంది. సంతానం వృద్ధి చెందుతుంది.

కాత్యాయని..



కాత్యాయనుడు కఠోర తపస్సు చేసి జగన్మాతను కుమార్తెగా పొందాడు. ఎడమ వైపు రెండు చేతుల్లో ఖడ్గం, తామరపువ్వు, కుడివైపు అభయ, వరద ముద్రలతో చతుర్భుజిగా, సింహవాహినిగా కాత్యాయని సాక్షాత్కరిస్తుంది. ఈ దేవిని భక్తితో సేవించినవారికి చతుర్విధ పురుషార్థాలు లభిస్తాయి. రోగాలు, శోకాలు, సంతాపాలు, భయాలు దూరమవుతాయి. జన్మజన్మాంతర పాపాలు నశిస్తాయి.

కాళరాత్రి..



భూత, ప్రేత, పిశాచ గణాలు ఈ తల్లిని పేరు వినపడితే పరుగు లంఘిస్తాయి. నిరంతరం శుభాలు కలిగించే తల్లి గనుక ఈమెను శుభంకరిగా ఆరాధిస్తారు. చిక్కటి నలుపు వర్ణపు మేనిచ్ఛాయతో, నల్లటి కేశాలను విరబోసుకుని దర్శనమిస్తుంది. మూడు కన్నులు ఉంటాయి. ఈ తల్లి గార్దభవాహినిగా దర్శనమిస్తుంది. ఇనుప ముల్లు, ఖడ్గం ఆయుధాలుగా ధరించి ఉంటుంది. ఈమెను ఉపాసించే వారికి భయాలన్నీ తీరిపోతాయి.

మహాగౌరి..



ఈమెను ఎనిమిదేళ్ల కన్యగా పూజించే ఆచారం ఉంది. పరమేశ్వరుణ్ణి పతిగా కోరి కఠోర తపస్సు చేసిన సమయంలో గౌరీదేవి పచ్చని పసిమి శరీరం నీల వర్ణంలోకి మారిపోయింది. శివుడామెను తన జటాజూటంలోని గంగతో తడిపి చల్లదనాన్ని కలిగించాడు. తిరిగి అమె మధ్యస్తమైన గౌర వర్ణంలోకి మారింది. మహాగౌరిగా సాక్షాత్కరించింది.

సిద్ధిధాత్రి..



మహర్నవమి నాడు సిద్ధిధాత్రిని శ్రీరాజరాజేశ్వరిగా అలంకరించి కొలుస్తారు. అణిమాది అష్టసిద్ధులు ప్రసాదించే తల్లి ఈమె. తామరపువ్వు మీద ఆశీనురాలై ఉంటుంది. నాలుగు చేతుల్లో చక్రం, గద, శంఖం, తామరపువ్వులు ధరించి ఉంటుంది. ఈమె కృపతో సాధకుల లౌకిక, పరమార్థిక మనోరథాలు నెరవేరుతాయి.

రమావాణి సేవిత రాజరాజేశ్వరి..



శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారి అలంకారంలో చివరి రూపం రమావాణి సేవిత రాజరాజేశ్వరి దేవి. సకల భువన బ్రహ్మాండాలకు రాజరాజేశ్వరీదేవి ఆరాధ్య దేవత. మహాత్రిపుర సుందరిగా ఈ దేవత త్రిపురాత్రయంలో పూజలందుకుంటుంది. చతుర్భుజాలు కలిగిన ఈ దేవి బాణం, అంకుశం, చెరకుగడ, వరహస్తం ధరించి భక్తులకు దర్శనమిస్తుంది. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను ఈ మూర్తి తన భక్తులకు వరాలుగా అనుగ్రహిస్తుంది.

మహానందిలో నేటి నుంచి దసరా మహోత్సవాలు

- ఈ ఏడాది ప్రత్యేకంగా మూలమూర్తికి నిత్య అలంకరణలు
- పట్టుగొడుగులను అందించిన దాతలు


ఉత్సవాలకు దాతలు అందించిన పట్టుగొడుగులు

మహానంది: క్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతి రోజూ ప్రత్యేక అలంకరణలు చేయనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు యాగశాల ప్రవేశం, చండీహోమాలు, నాలుగు కాలార్చన పూజలు, వాహన సేవలు, గ్రామోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. అలంకరణ సేవల్లో భాగంగా సోమవారం శ్రీ శైలపుత్రిదుర్గ, 23న శ్రీ బ్రహ్మచారిణి దుర్గ, 24న శ్రీ చంద్రఘంట దుర్గ, 25న శ్రీ కూష్మాండదుర్గ, 26న శ్రీ స్కందమాత దుర్గ, 27న శ్రీ కాత్యాయని దుర్గ, 28న శ్రీ కాళరాత్రి దుర్గ, 29న శ్రీ మహాగౌరీ దుర్గ, 30న శ్రీ సిద్ధిధాత్రి దుర్గ, 1న శ్రీ కామేశ్వరీదేవి అలంకరణలు ఉంటాయని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

మూలమూర్తికి నూతన అలంకరణలు..

శ్రీ కామేశ్వరీదేవి మూలమూర్తికి నిత్యం ఒక అలంకరణ ఉంటుందన్నారు. అందులో భాగంగా శ్రీ బాల త్రిపుర సుందరి, శ్రీ మహాగౌరీ, శ్రీ అన్నపూర్ణేశ్వరి, శ్రీ రాజరాజేశ్వరి, శ్రీ లలిత, శ్రీ మహాలక్ష్మి, శ్రీ గాయత్రి, శ్రీ సరస్వతి, శ్రీ మహిషాసుర మర్దిని, శ్రీ కామేశ్వరీదేవితో పాటు చివరి రోజు శ్రీ శివకామేశ్వరీ అలంకరణ ఉంటాయని అధికారులు, పండితులు తెలిపారు.

పట్టుగొడుగుల విరాళం..

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు స్వామి, అమ్మవార్లకు అలంకార సేవలు చేపట్టనున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఏపీఎం తిరుపాల్ రెడ్డి, సౌజన్య దంపతులు నవరాత్రి ఉత్సవాల నిమిత్తం నూతన రెండు పట్టుగొడుగులను అందజేసినట్లు ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం దాతలు అందించిన రెండు పట్టు గొడుగులకు సంప్రోక్షణ పూజలు నిర్వహించారు.

- నందికొట్కూరు: పట్టణంలోని చౌడేశ్వరి దేవాలయం, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వర ఆలయం, మిడుతూరు మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో సోమవారం నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు అమ్మవారు భక్తులకు వివిధ అలంకారాల్లో దర్శనమివ్వనున్నారు. పట్టణంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో 22న శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న శ్రీ కాత్యాయనీ దేవి, 26న శ్రీ మహాలక్ష్మిదేవి, 27న లలితా త్రిపుర సుందరీ దేవి, 28న శ్రీ మహా చండీదేవి, 29న సరస్వతీ దేవి, 30న దుర్గా దేవి, అక్టోబర్ 1న మహిషాసుర మర్దిని, 2న శ్రీ రాజ రాజేశ్వరీదేవిగా అలంకరించనున్నారు. ప్రతి రోజు ఉదయం 7 గంటలకు ప్రత్యేక అలంకరణలతో అభిషేక పూజలు నిర్వహించనున్నారు.


చౌడేశ్వరిదేవి అమ్మవారు

- ఆత్మకూరు: పట్టణంలోని చౌడేశ్వరి దేవి దేవాలయంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి వివిధ అలంకరణలో అమ్మవారు దర్శనమిస్తారని ఆలయ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈనెల 22వ తేదీన తొలిరోజు శ్రీ బాలత్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 23న శ్రీ గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణాదేవి, 25న మహాలక్ష్మిదేవి, 26న శ్రీ కాత్యాయినీదేవి, 27న శ్రీ లలితాదేవి, 28న శ్రీ మహాచండీదేవి, 29న సరస్వతిదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిసాసురమర్ధిని, 2న రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని వివరించారు.

హోరాహోరీగా స్కేటింగ్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో రాష్ట్రస్థాయి స్కేటింగ్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. క్రీడా భారతి ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మకాయల సుధాకర్, ఫిరోజ్ ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నంద్యాలలో మొదటి సారి స్కేటింగ్ పోటీలు జరుగుతున్నట్లు చెప్పారు. ఇందులో నాలుగేళ్ల నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు గల విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. క్రీడా భారతి సభ్యులు పాల్గొన్నారు.

మురుగు నీరు తొలగింపు

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలోని గొల్లపేటలో డ్రైనేజీల్లేక రోడ్లపైన మురుగు నీరు ప్రవహిస్తూ ఉండటం, మురుగునీటిలో ఉన్న కుళాయి నుంచి వచ్చే తాగునీటిని కాలనీవాసులు పట్టుకుంటున్న విషయంపై ఈనెల 19న 'సాక్షి' దినపత్రికలో 'ఇలా ఉంటే రోగాలు రావా' అనే శీర్షికన కథనం ప్రచురితమైనంది. దీనికి స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, గ్రామసర్పంచ్ మొట్టెబాలయ్య, ఎంపీటీసీ మోతెవెంకటమ్మ లు గొల్లపేటలో మురుగునీటి నిల్వల్లేకుండా జేసీబీతో డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయించారు. కుళాయి చుట్టుపక్కల ఉన్న మురుగునీటిని తొలగించారు.



జేసీబీతో డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

రెండు బైకుల ఢీ..ఇద్దరికి గాయాలు

బండి ఆత్మకూరు : మండలంలోని సంతజూటూరు గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల వైపునకు వెళ్తున్న రెండు బైకు లు పెట్రోల్ బంకు వద్దకు రాగానే పక్క పక్క నుంచ ఢీ కొట్టుకుని లింగాపురం గ్రామానికి చెందిన కొరప్రోలు. తిరుపాలు, మద్దూరు గ్రామానికి చెందిన షేక్. మక్బుల్, బాష గాయపడగా, స్థానికులు వారిని 108 అంబుల్స్‌లో సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఆత్మకూరు: వైద్యకళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి మంజూరైన 10 వైద్య కళాశాలలను ప్రభుత్వ నిధులతో నిర్మించి నిర్వహించాలన్నారు. ఆరోగ్యశ్రీలో బీమా విధానాన్ని విడనాడాలని కోరారు. ప్రైవేట్ ఆసుపత్రులను నియంత్రించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత సేవలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆరోగ్యానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలన్నారు. పార్టీ పట్టణ నాయకులు రామ్‌నాయక్, ఎ.సురేంద్ర, షేక్‌ఇస్మాయిల్, జి.నాగేశ్వరరావు, నాయకులు ఎ.కిరణ్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండల పరిధిలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన కలబండి వెంకటయ్య అనే వ్యక్తి ఈనెల 19వ తేదీన గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబ సభ్యులకు ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ తరపున ఆర్థిక సాయం అందించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు మొల్ల మహమ్మద్ పాషా తెలిపారు. ఆదివారం ఆయన కొక్కెరంచ గ్రామంలో మృతుడు వెంకటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈఎస్‌సీ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆయన కాంట్రాక్ట్ వర్క్‌షాప్ అటెండెంట్‌గా ఎన్నో సేవలందించారన్నారు. అందుకు గాను ఏపీజీపీటీఎస్ఏ సంఘం తరుపున రూ.52,926లను ఆర్థిక సహాయంగా అందిచామన్నారు.

వేధిస్తున్న నీటి సమస్య


సుంకులమ్మ ఆలయం వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ఏ.కోడూరు ముస్లింపేట వాసులు

బండి ఆత్మకూరు: మండలంలోని ఏ.కోడూరు గ్రామంలోని ముస్లిం పేట వాసులను పది రోజులుగా నీటి సమస్య వేధిస్తోంది. విద్యుత్ మోటారు మరమ్మతులకు గురవడంతో సమస్య తీవ్రంగా మారింది. దీంతో ఊరి బయట ఉన్న సుంకులమ్మ గుడి వద్ద నుంఇ బురుద దారిలో వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. స్థానికులు అధికారులకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ప్రయోజనం లేదని వాపోయారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి భార్గవిని వివరణ కోరగా.. మోటార్లను మరమ్మతులకు ఇచ్చామని, రెండు రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజి నాయక్

కొత్తపల్లి: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సెల్ వాడకం ఎక్కువగా ఉండడంతో సైబర్ మోసగాళ్లు ఎక్కువగా నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఓటీపీ ఫ్రాడ్స్, ఇతర సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ జయశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.


పొలాల్లో ప్రవహిస్తున్న నీరు

భారీ వర్షం

- ఆత్మకూరు, మహానందిలో దంచి కొట్టిన వాన
- నీట మునిగిన పంట పొలాలు


కృష్ణ నంది ప్రాంతంలో విరిగిపడిన అరటిచెట్లు

ఆత్మకూరు: మండలంలో ఆదివారం వేకువజామున భారీ వర్షం కురిసింది. 52.8 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. వర్ష బీభత్సానికి భవనాశి, సుద్దవాగు, గుండ్లకమ్మ వాగులు పొంగి ప్రవహించాయి. తెరపినివ్వని వర్షాలతో మొక్కజొన్న, పత్తి రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయే పరిస్థితి నెలకొంది. పొలాల్లో మోకాళ్లలోతు నీరు నిల్వ ఉండడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు పెట్టుబడులు పెట్టిన రైతులు, కళ్ల ఎదుటే మొక్కజొన్న పంట కళ్లెదుటే కుళ్లిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు దాదాపు 700 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టపోయినట్లు రైతులు వాపోతున్నారు. మండలంలో 400 ఎకరాల్లో మాత్రమే దెబ్బతిందని వ్యవసాయ అధికారులు పేర్కొంటుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఈనెల 25వ తేదీన తుఫాన్ ఉండే అవకాశముందని వాతారణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. కాగా ఈనెలలో 12న 94.8 మి.మీ., 4న 56.4మి.మీ. భారీ వర్షం కురిసింది.

నేలకొరిగిన అరటిచెట్లు

మహానంది: వర్ష బీభత్సానికి లోతట్టు కాలనీల్లో ఉన్నవారితో పాటు రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. తిమ్మాపురం, కృష్ణనంది, గాజులపల్లె గ్రామాల సమీపాల్లో ఆదివారం తెల్లవారుజామున వచ్చిన భారీ గాలులు, కుండపోత వర్షానికి అరటి తోటల్లోని చెట్లు నేలకొరిగాయి. కృష్ణనంది ప్రాంతంలో సాగు చేస్తున్న రైతుల పొలాల్లో ఎకరాకు సుమారు 400 వరకు చెట్లు పడిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ ఆదివారం తెలిపారు. మండలంలోని ప్రజలు వారికున్న సమస్యల పై అర్జీలు ఇవ్వాలని సూచించారు. సంబంధిత శాఖా అధికారులచే అర్జీలు పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.